నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

పోచారం: ఘట్‌కేసర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టినందున శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బలరామ్ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు యంనంపేట్, స్వర్ణభూమి వెంచర్, శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజ్, సాయితేజ కాలనీ, నవదుర్గనగర్, విహారి హోమ్స్ ఫేస్ 1, 2, శ్రీనివాస, సప్తగిరి, ఎంఎల్ఆర్, శేషాద్రి, నారాయణాద్రి కాలనీలు, వసంత విలాస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నారపల్లిలో.. నారపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మిపురం, సప్తగిరి, ఎమ్మెస్సార్ కాలనీలు, బాబానగర్, గణేష్‌నగర్, నారపల్లి ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ ప్రదీప్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నికలు



ఘట్‌కేసర్: ఎదులాబాద్ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా శివకుమార్, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, ధనుంజయ, ప్రధాన కార్యదర్శులుగా మల్లేష్, శంకర్, కోశాధికారిగా శ్రీనివాస్, సలహాదారులుగా బి.నాగరాజు, లింగం, డి.నాగరాజును ఎన్నుకున్నారు. అనంతరం సభ్యులు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

సత్కారం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ నాచారం ఫైర్ విక్టిమ్ కాలనీ (ఎస్ఎఫ్‌వీ) కాలనీ నూతన అధ్యక్షులు నగేష్‌ను గురువారం దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మారావు ముదిరాజ్, కమిటీ సభ్యులు దశరథ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వీరస్వామి, రాములు, రవి, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు నిర్వహించారు. ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ మరియు తలసేమియా అండ్ సికిల్‌సెల్ సొసైటీ సహకారంతో గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఐపీఏ సెక్రటరీ రామ్‌ప్రసాద్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ తుల్జారాణి విద్యార్థులకు తలసేమియా వ్యాధి, రక్తదానం పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో పిన్సిపాల్ తుల్జారాణి, మహ్మద్ జలీల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పౌజ్ కేటగిరీని దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయులపై చర్యలు

సాక్షి, సిటీ బ్యూరో: ఉపాధ్యాయులకు ఇటీవల నిర్వహించిన బదిలీల కౌన్సిలింగ్‌లో భాగంగా స్పౌజ్ కేటగిరీలో 11 మంది ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా సమీపంలో ఉన్న ఖాళీ పోస్టులను ఎంపిక చేసుకోవటంపై చార్జెస్ ఫ్రేమ్ చేసినట్లు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ చార్జెస్ పై ఇద్దరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తుర్వులను పొందినట్లు ఆమె పేర్కొన్నారు. స్టే ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయుల్లో రామేశ్వర్, అనిల్ కుమార్ ఉన్నట్లు తెలిపారు. వీరి స్టేను ఎత్తివేసేందుకు మేడ్చల్ జిల్లా విద్యాశాఖ వెకేట్ పిటీషన్ దాఖలు చేసినట్లు డీఈఓ పేర్కొన్నారు. అలాగే జిల్లాలో స్పౌజ్ కేటగిరీకి విరుద్ధంగా బదిలీ అయిన ఉపాధ్యాయుల్లో స్మితారాణి, అరుణాదేవి, స్వర్ణలత, సునీత, శ్రీలత, శైలజ, సృజన, స్వర్ణలత తదితరులు ఉన్నట్లు తెలిపారు. తదుపరి ఉత్తర్వులను అనుసరించి స్పౌజ్ కేటగిరీని దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయుల పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా విద్యాశాఖ తీసుకుంటున్న చర్యల నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాలు గురువారం నిర్వహించి తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని తాత్కాలికంగా వారు నిలుపుదల చేసుకున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్



పోచారం: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోచారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. సీఐ రాజు తెలిపిన ప్రకారం.. అన్నోజిగూడలోని ఎల్ఎస్ కాలనీకి చెందిన పాండవుల మహేష్ (19) ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ప్రాంతానికి వెళ్లి 900 గ్రాముల గంజాయిని రూ. 6 వేలకు కొనుగోలు చేశాడు. అందులో కొంత భాగాన్ని స్వయంగా వినియోగిస్తూ, మిగిలిన భాగాన్ని ఇతరులకు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఎల్ఎస్ కాలనీలో తనిఖీలు చేపట్టగా.. సమీపంలోని పొదల్లో దాచిన 660 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని రిమైండ్‌కు తరలించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

మౌలాలి: వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి డివిజన్ల వారీగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చెక్కులను అందజేశారు. గురువారం వినాయక్‌నగర్ డివిజన్‌కు చెందిన రమణయ్యకు రూ.23 వేలు, యాదమ్మకు రూ.24 వేలు, వసంతలక్ష్మికి రూ.17,500 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. బద్దం పరశురామ్‌రెడ్డి, చందు, సూరి, బాలకృష్ణ, ఫరీద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

సమగ్ర ఇంటింటి కులగణన పరిశీలన



కులగణనను పర్యవేక్షిస్తున్న మహేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో కులగణన వివరాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ కుల సర్వేనే ఘనాపూర్‌లో గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీసీల సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ ఉన్నతికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలో ఇన్యూమరేటర్లు అడిగిన పూర్తి సమాచారం ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ కులగణనకు సహకరించాలని కోరారు.

అభివృద్ధి ఫలాలు పేదలకు అందించడమే లక్ష్యం

ఘట్‌కేసర్: బడుగు, బలహీన వర్గాలు, వెనకబడిన కులాలకు అభివృద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టిందని మున్సిపల్ చైర్‌పర్సన పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని చైర్‌పర్సన్ ఇంటిలో గురువారం కులగణన వివరాలు అందజేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. అపోహలు వీడి కుటుంబ సభ్యుల వివరాలను అధికారులకు తెలియజేయాలని, అధికారులు పొరపాట్లు లేకుండా సర్వే చేయాలని సూచించారు. మా వంతు బాధ్యతగా కులగణన వివరాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

అభినందనలు



కీసర: భారతదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతనమైన అయోధ్యలోని బాలరాముని ప్రాంగణంలో మేడ్చల్ జిల్లా నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులైన సాయి అనుభవి (10 క్లాస్), సాయి వైభవి (8 క్లాస్), జాహ్నవి (9క్లాస్) నృత్య ప్రదర్శనచేయటం వారు చేసుకున్న పూర్వజన్మ సుకృతమని, పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు. గురువారం ఈ మేరకు నాగారం సెరినిటీ పాఠశాలలో ఇటీవల భారత్ ఆర్ట్స్ అకాడమీ వారి నేతృత్వంలో అయోధ్యలోని రామాలయంలో రామ్ లల్లా సంగీత నృత్య అర్చన కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ముఖ్యకార్యదర్శి నోములు వసంత తదితరులు పాల్గొన్నారు.

కృషి హోంలో ముగిసిన క్రీడలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారయణ

మేడ్చల్: బాలల దినోత్సవం సందర్భంగా ప్రతీ సంవత్సరం గౌడవెల్లిలోని సైకోరియస్ కృషి హోంలో నిర్వహించే వార్షిక క్రీడలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాల, ప్రాంతాలకు చెందిన 23 పాఠశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, రన్నింగ్, డ్రాయింగ్, మ్యూజికల్ చైర్, డ్యాన్స్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు మేడ్చల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్‌రావు, కృషి డైరెక్టర్లు శ్యాముల్, శారద తదితర అతిదులు బహుమతులు అందజేశారు. క్రీడలను కృషి సభ్యులు రవికుమార్, వెంగళరావు, వెంకటేష్, భాస్కర్ తదితరులు నిర్వహించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేందుకు కృషి చేయాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్ కుమార్‌రెడ్డి అన్నారు. సన్ ఫైటర్స్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన 11వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ 2024 పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు శక్తిని పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయన్నారు. యువతీయువకులు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలని సూచించారు. విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల, కాకతీయ స్కూల్ జేజీఆర్ ఉన్నత పాఠశాల, శౌర్యపాఠశాల, రుషి స్కూల్ విద్యార్థులు గెలుపొందగా.. వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎస్ఎఫ్‌కేఏ వ్యవస్థాపకులు నంద ప్రసాద్‌యాదవ్, మిట్ట నర్సయ్యగౌడ్ పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు

మల్లాపూర్: హెచ్ఎంటీనగర్ పెద్ద చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను చెరువుకట్టపై వదిలేయడంతో కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన చెరువుకట్టపై పేరుకుపోయిన గుర్రపుడెక్కను రాంకీ సిబ్బంది డంపింగ్ యార్డుకు తరలించారు. దీంతో దోమల బెడద పూర్తిగా తొలగిపోతుందని కార్పొరేటర్ పేర్కొన్నారు. రాంకీ ఇన్‌చార్జి నవీన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, బుచ్చన్న, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. హెచ్‌బీకాలనీ, మంగాపురం కాలనీలో గురువారం సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. దశలవారీగా డివిజన్ వ్యాప్తంగా అంతర్గత రోడ్లతో పాటుగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని, పనుల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకూడదన్నారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: అల్వాల్ డివిజన్ శ్రీనివాసనగర్‌లో గురువారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో చాలాకాలం క్రితం మంజూరైన రోడ్లను పరిశీలించారు. పాత కాంట్రాక్టర్ నెలరోజులుగా పనులు పెండింగ్‌లో ఉండటంతో కొత్త కాంట్రాక్టర్‌కు రోడ్డు పనులను అప్పగించారు. వెంటనే పనులను ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. డీఈ ప్రశాంతి, ఏఈ అభిషేక్, రామారావు, ప్రేమ్, సాజిద్, నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఉన్న డ్వాక్రా భవనానికి అదనపు అంతస్తు నిర్మించేందుకు చైర్మన్ కొండల్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి మంజూరైన రూ. 15 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శైలజ, మాజీ ఉపసర్పంచ్ బాల్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, రమేష్, ప్రశాంత్, నారాయణ, తుకారాం, రేణుక, జానకి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే మాదిగల హక్కులు సాధ్యం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని దళిత భవన్‌లో ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల కోసం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ కళామండలి అధ్యక్షులు అశోక్, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యులు రామచంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రశాంత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. పోరాటాలతోనే మాదిగల హక్కులు సాధ్యమవుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణలో ఎమ్మార్పీఎస్ అలుపెరగని పోరాటం చేసిందన్నారు. మేడ్చల్ జిల్లాలోని 15 మండలాల్లో ఇన్‌చార్జి, కో-ఇన్‌చార్జిలను నియమించారన్నారు. ప్రతి గ్రామం, బస్తీలో ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రణయ్, స్వామి, సిద్దులు, రాంచందర్, ఆనంద్, వేణు, రవి, నరేష్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



కీసర: ఆటోలో రూ. 1.30 లక్షలు విలువ చేసే ఫోన్‌ను మరిచిపోయిన వ్యక్తికి పోలీసులు తిరిగి అప్పగించిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కీసర సీఐ. వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి ఆర్ఎల్‌నగర్‌కి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్షయ్‌కుమార్ గచ్చిబౌలిలోని పోసిస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 20న ఓలా ఆటో వెహికిల్ బుక్ చేసుకొని ఇంటికి వస్తుండగా రూ. 1.30 లక్షలు విలువచేసే తన యాపిల్ ప్రో 15 మ్యాక్స్‌ను ఆటోలో మరిచి పోయాడు. ఇంట్లోకి వెళ్లి చూసుకుని తిరిగి ఆటో వ్యక్తికి ఫోన్ చేస్తే అతను ఎత్త లేదు. వెంటనే కీసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం ఆటో డ్రైవర్ నుంచి ఆపిల్ పోన్ తెప్పించి అతనికి అప్పగించారు.

డివిజన్ల సమస్యలను పరిష్కరించండి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్, వెంకటాపురం, మచ్చబొల్లారం డివిజన్‌లోని సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ్‌చౌహాన్‌ను కలిశారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని అల్వాల్ ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ లైబ్రరీతో పాటు మచ్చబొల్లారంలో 7 కాలనీల డ్రైయిన్ ఔట్‌లెట్ సమస్య, శ్రీరామ్‌కాలనీ, మడికట్ల బస్తీలో వరదనీటి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితాఅనిల్‌కిషోర్‌గౌడ్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, జోలి రమేష్, శరణగిరి, పవన్, శ్రీకాంత్‌రెడ్డి, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీని సమస్యలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులోని రాజ్‌సుఖ్ నగర్ కాలనీలో మున్సిపల్ సాధారణ నిధులు సుమారు 20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన మున్సిపల్ వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులో సీసీ రోడ్డుపనులు, అంతర్గత మురికి కాలువల నిర్మాణాలు, వీధి దీపాల ఏర్పాట్లు, మంచినీటి పైప్‌లైన్ పనులు తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున మున్సిపల్ నిధులను వెచ్చించడం జరుగుతుందన్నారు. కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు



కీసర: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మక శక్తికి వెలికి తీసేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని నాగారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు అన్నారు. గురువారం జన విజ్ఞాన వేదిక కీసర మండల కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు 2024 భాగంగా మండల స్థాయి పరీక్ష నాగారం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించగా.. పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు, చెకుముకి కన్వీనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. పరీక్షల్లో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి వచ్చిన విద్యార్థులందరిని అభినందిస్తూ విజేతలందరికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ నెల 28న జరిగే జిల్లాస్థాయి చెక్‌ముకి పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిపోటీలకు ఎన్నిక కావాలని అభిలాషించారు. కార్యక్రమంలో జేవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కీసర మండలనాయకులు చౌదరి, సంతోషి, రామచంద్రయ్య, రమాదేవి, స్వప్న, శివలీల, హరిప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల యూనిట్ల పంపిణీ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం తండా, రావల్‌కోల్ తండాకు చెందిన గిరిజన మహిళలకు ఐసీఏఆర్-నేషన్ మీట్ రిసెర్చ్ సహకారంతో గురువారం పెరటి కోళ్ల యూనిట్‌లను పంపిణీ చేశారు. జిల్లా పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పూడూర్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఆర్సీ డైరెక్టర్ సహర్ష్ భూదే, పశుసంవర్థకశాఖ జిల్లా ఏడీ ప్రభురాజ్ పెరటి కోళ్ల పెంపకం, వాటి సంరక్షణ, వ్యాధులు, గుడ్ల ఉత్పాదన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కోళ్ల యూనిట్ పొందిన మహిళలు వాటి పెంపకంపై దృష్టి సారించి లాభాలు పొందాలని, వ్యాపారవేత్తలుగా ఎదగాలని కోరారు. రాజబొల్లారం తండాకు 28 యూనిట్లు, రావల్‌కోల్ తండాకు 20 యూనిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, అధికారులు బలిరామ్, కురుమూర్తి, శోభారాణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా.. సామూహిక కార్తీక దీపోత్సవం

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా దేవాదాయశాఖ ఆదేసానుసారం నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా 20వ రోజైన గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్ రెడ్డి తెలిపారు. దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా ప్రమిదలు, వత్తులు, నూనె ఇవ్వడంతోపాటు తాంబూలం, ప్రసాదాలు అందజేయడం జరిగిందన్నారు.



సామూహిక కార్తీక దీపోత్సవంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, భక్తులు తదితరులు

సివిల్స్ సాధనపై అవగాహన



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఈసీ కళాశాలలో గురువారం యూపీఎస్సీ మాస్టర్ క్లాస్ అంశంపై 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ వారు జీ5 మీడియా గ్రూప్‌తో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. ఇతరులు మన గురించి తెలుసుకునే విధంగా ఎదగాలని, యూపీఎస్సీలో సీటు సాధించాలన్నారు. భవిష్యత్ తరానికి అవసరమైన శిక్షణ అందించడం తన అకాడమీ లక్ష్యమని తెలిపారు. అనంతరం స్టడీ మెటీరియల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అకాడమీ చీఫ్‌మెంటర్ భవానీ శంకర్, కళాశాల సెక్రటరీ శ్రీశైలంరెడ్డి, ప్రిన్సిపాల్ ఏఎస్ రెడ్డి, లక్ష్మయ్య, విజయ్‌కార్తిక్, గిరిప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాగింగ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటయ్య తదితరులు



ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

కీసర: కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు తోటి విద్యార్థుల పై ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని కీసర సీఐ వెంకటయ్య అన్నారు. గురువారం కీసరలోని శ్రద్ధ ఇంటర్, స్ఫూర్తి డిగ్రీ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్, డ్రగ్స్, సైబర్‌క్రైమ్ వంటి అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కలిగే అనర్థాలను, సైబర్‌క్రైమ్ నేరస్థుల చేతిలో మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చక్కగా చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలాషించారు. ఎస్.ఐ వెంకటేష్, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఘనాపూర్ గ్రామ పరిధిలోని మెడిసిటీ మెడికల్ కళాశాలలో గురువారం 300 మంది విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ సోదర, స్నేహ భావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడడం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటుంటాయని వివరించారు. కళాశాల దశలో ర్యాగింగ్, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.